గిట్టుబాటు ధరలు.. ఆనందంలో గిరి రైతులు

- గిరిజనులకు బాసటగా నిలుస్తున్న జీసీసీ
- జోరందుకున్న అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు



జి.మాడుగుల వారపు సంతలో ఏర్పాటు చేసిన జీసీసీ కొనుగోలు కేంద్రం

జి.మాడుగుల: గిరిజన సహకార సంస్థ ఒకపక్క గిరి రైతులకు బాసటగా నిలుస్తోంది. మరోపక్క ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకుంటూ వ్యాపారాన్ని విస్తరిస్తోంది. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ బ్రాండ్‌ను నిలబెట్టుకుంటోంది. అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు జిల్లాలోని అన్ని మండలాల్లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఔట్‌లెట్లు ఏర్పాటుచేసింది. సంతల్లో కూడా రైతుల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేస్తోంది.

గిరిజనులు పండిస్తున్న రాజ్‌మా, కాఫీ(కాయ,పప్పు)వంటి వ్యవసాయ ఉత్పత్తులు, చింతపండు, కరక్కాయలు, శీకాయ, కుంకుడుకాయలు, నరమామిడి, ఉసిరిపప్పు, నల్ల జీడి పిక్కలు వంటి అటవీ ఉత్పత్తులు కొనుగోలుకు వారపు సంతలు, ప్రత్యేకంగా కొన్నిచోట్ల ఔట్‌లెట్లను ఏర్పాటు చేశారు. జీసీసీ ఇప్పటికే అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలను ప్రకటించింది. రైతులు అటవీ, వ్యవసాయోత్పత్తులను జీసీసీకి విక్రయించి, గిట్టుబాటు ధరలు పొందవచ్చుని విస్తృత ప్రచారం చేస్తోంది.

ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులు తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను దళారులకు విక్రయించి మోసపోవద్దని అవగాహన కల్పిస్తున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు కేంద్రాలను జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మండలంలో జి.మాడుగుల సంతబయలు గ్రామంలో వారపు సంతలో జీసీసీ కౌంటర్ల ద్వారా గిరిజన ఉత్పత్తులు కొనుగోలు చేశారు. గిరిజన రైతులు దళారీ వ్యాపారుల బారిన పడి నష్టపోకుండా వారి ఉత్పత్తులకు జీసీసీ ద్వారా గిట్టుబాటు ధర కల్పిస్తూ వారపు సంతలో కొనుగోలు చేస్తున్నట్టు జీసీఎంఎస్ బ్రాంచి పరిధిలో అధికారులు తెలిపారు.

అటవీ ఉత్పత్తుల ధరలు	
అటవీ ఉత్పత్తి	వెల (కిలో)
చింతపండు(పిక్కతో)	రూ.32.40
చింతపండు(పిక్కతీసినది)	రూ.63
కరక్కాయలు	రూ.15
శీకాయ	రూ.55
కుంకుడుకాయలు	రూ.55
నరమామిడి చెక్క	రూ.18
ఉసిరి పప్పు	రూ.80
నల్ల జీడి పిక్కలు	రూ.15
వ్యవసాయ ఉత్పత్తుల ధరలు	
రాజ్‌మా చిక్కుళ్ళు (తెలుపు)	రూ.90
రాజ్‌మా చిక్కుళ్లు(ఎరుపు)	రూ.75
రాగులు(చోళ్ళు)	రూ.22
కాఫీ చెర్రీ (గుల్ల)	రూ. 145
కాఫీ పార్చమెంట్	రూ.285
పసుపు	రూ.60

ఉత్పత్తులకు గిట్టుబాటు ధర



గిరిజన ప్రాంతాల్లో అటవీ, వ్యవసాయోత్పత్తులకు జీసీసీ గిట్టుబాటు ధరలు కల్పించింది. వారపు సంతల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా జీసీసీ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి గిట్టుబాటు ధర పొందవచ్చు.

–ఎం.సింహాచలంరాజు,
సెండీ ఇన్‌స్పెక్టర్, జి.మాడుగుల

క్లుప్తంగా

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


చిన్నబ్బాయి (ఫైల్)

రాజవొమ్మంగి: స్థానిక అంబేడ్కర్ ప్రభుత్వ పాఠశాలలో(జీపీఎస్) ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వజ్రపు చిన్నబ్బాయి (55) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నబ్బాయి మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయులు బాధిత కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు.

సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివి


సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు, విద్యార్థులు

అడ్డతీగల: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఏపీసీసీ నేతలు నిర్వహించారు. పీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ చైర్మన్ సుధాకర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కుంజం మురళీ

దేవీపట్నం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ ఎప్పటికప్పుడు గుర్తిస్తూ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కుంజం మురళీ తెలిపారు. ఇందుకూరుపేటలో మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ, వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కె.ఎస్.రత్నకుమారి, వైస్ ఎంపీపీలు లక్ష్మీకుమారి, మురళీకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, బాలంనాయుడు

పెదబయలు: మండలంలోని జామిగుడ పంచాయతీ గుంజివాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జర్సింగి బాలంనాయుడు 99వ జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ బాలంనాయుడు సేవలను కొనియాడారు. జామిగుడ పంచాయతీకి రోడ్డు, వంతెన మంజూరైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా బాలంనాయుడు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చేతులమీదుగా పేదలకు చీరలు, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీలు గంగాభవాని, సూర్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సర్పంచ్‌లు వెంకటరావు, లోయితాస్, నాయకులు వెంకయ్య, చంద్రబాబు, సూరయ్య, ఉద్యోగ, ఉపాధ్యాయులు, శ్రీనివాసనాయుడు, మాలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

13న ఆలయ వార్షికోత్సవం

మునగపాక : సంతబయిల పురాతన విఘ్నేశ్వర దేవస్థానం వార్షికోత్సవాన్ని 13న నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ శ్రీరామ వెంకట నరసింగరావు(రాము) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకోవాలని కోరారు.

సీతంరాజు సుధాకర్ విజయమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


రవ్వలగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ ఉషారాణి, నేతలు


కించుమండలోని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, నాయకులు


ఎన్నికల ప్రచారం చేస్తున్న సర్పంచ్ రామకృష్ణ, నాయకులు

చింతపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకి వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని పలు పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ అనూషాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపీటీసీ జయలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పట్టణంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పద్మాపురం, గన్నెల, మాడగడ, పెదలబుడు పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ ప్రభుత్వం ఉన్నత పాఠశాలలు, గిరిజన ఆశ్రమ, మండల పరిషత్, పాఠశాలలతో పాటు గ్రామ సచివాలయల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ఓటు ప్రాధాన్యత ఇవ్వలన్నారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, సర్పంచ్ సుస్మిత, నాయకులు బాలరాజు, సుంద్ర, సర్సింగ్, గురుమూర్తి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. కించుండ పంచాయతీలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం చేపట్టారు. సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, లలిత, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, వైస్ ఎంపీపీలు పంచడి లలిత, ఆనందరావు, ఎంపీటీసీ గుజ్జెల విజయ, నాయకులు సింహాచలం, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచ్ శారద, లీలారాణి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మంలంలోని తడిగిరి, తీగలవలస పంచాయతీల్లో అల్లంపుట్టు, కామయ్యపేట గ్రామాల్లో పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పాతకోట పంచాయతీ మత్రిపాలెం, చింతలవీధి, పనసపుట్టు, దిగరూడి, మంగళిమామిడి గ్రామల్లో సందర్శించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్‌లు బేసు, చిన్నయ్య, పార్టీ మండల కో –కన్వీనర్ కోటిబాబు, నాయకులు బాలన్న, బొంజుబాబు, లవకుశ, రాంబాబు, బలరాం, నీలమ్మ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: ఉత్తరాంధ్ర పట్టబద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ కోరారు. దావనాపల్లి పంచాయతీ సర్పంచ్ రామకృష్ణతో కలసి శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

ఆకట్టుకున్న గరగ నృత్యాలు


గరగ నృత్యం

రాజవొమ్మంగి: గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారి సంబరాల్లో భాగంగా రోజు గరగనృత్యాలు జరుగుతున్నాయి. రానున్న కొత్త అమావాస్య పర్వదినం వరకు రోజు పురవీధుల్లో గరగనృత్యాలు సంప్రదాయబద్ధంగా జరుగుతాయి. వీధుల్లో గరగలు రాగానే సాక్షాత్తు నూకాలమ్మ తల్లి తమ ఇంటికి వచ్చినట్టు భావించే భక్తులు గరగలకు పసుపునీరు పోస్తారు. పసుపు కుంకుమలు, దీపదూపాలు, ఫలహారాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గరగల నృత్యాలు వీక్షించేందుకు స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు వస్తున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

యలమంచిలి : సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరం అని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా న్యాయ వారోత్సావాల్లో భాగంగా మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం యలమంచిలి కోర్టు సముదాయంలో వెలుగు, వలంటీర్లు, డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి విచ్చేసి మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల కాలంలో మహిళలపై లైంగిక దాడులు అధికమయ్యాయని అన్నారు. ఇటువంటి అఘాయిత్యాలపై అవగాహన కలిగి, జాగ్రత్తలు పాటించాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లలో వచ్చే సందేశాల్లో మంచి చెడులపై అవగహన కలిగి ఉండాలన్నారు.

రెండు ఎకరాల జీడితోట దగ్ధం

అడ్డతీగల: మండలంలోని భీముడుపాకలలో ఇద్దరు గిరిజనులకు చెందిన జీడిమామిడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన గంతా పండమ్మ, చిలకల సీత అనే మహిళలకు చెందిన ఒక్కో ఎకరంలో 90 జీడిమామిడి మొక్కలు ఈ అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు అడవిలో కాల్చిన సిగరెట్ వంటివి వేయడం వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు చెబుతున్నారు. కాపునకు వచ్చిన జీడి మామిడి తోట అగ్నికి ఆహుతి కావడంతో ఇరువురు బాధిత గిరిజన రైతులు ఆవేదన చెందుతూ కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారులు స్పందించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి తమకు సాయమందించాలని వారు కోరుతున్నారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ


ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం జిల్లా కార్యదర్శి పండుబాబు

జి.మాడుగుల: స్థానిక జీసీసీ మండల స్టాక్ పాయింట్ వద్ద శుక్రవారం హమాలీ కార్మికులు ఏఐటీయుసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద రాష్ట్ర ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు మన్మధరావు పిలుపు మేరకు ఏజెన్సీ 11 మండలాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి వి పండుబాబు జెండాని ఆవిష్కరించారు. కార్మిక సంఘం నాయకులు బాబూరావు, సత్తిబాబు, శ్రీనుబాబు, సురేష్, మోహన్ తదితరలు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రావికమతం: రావికమతం, రోలుగుంట మండలాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం జోరుగా సాగుతోంది. పశుసంవర్ధక శాఖ రావికమతం ఏడీ టి.పుష్ప శుక్రవారం వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సాధారణంగా అక్టోబరు నెలలో వస్తుందన్నారు. ఈ నెలాఖరు వరకూ టీకా కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకూ రావికమతం, రోలుగుంట మండలాల్లో 5,270 డోసులు వేశామన్నారు.

తాండవ జలాశయంలో జోరుగా రొయ్యల వేట


జలాశయంలో వేటాడిన రొయ్యలు

గొలుగొండ: తాండవ జలాశయంలో రొయ్యల వేట జోరుగా సాగుతోంది. ఫిబ్రవరి చివరి వారం నుంచి మే చివరి వారం వరకు ఈ వేట నిర్వహిస్తారు. జలాశయం పరిధిలో ఉన్న గొలుగొండ, సాలికమల్లవరం, అమ్మపేట, గాదంపాలెం, విప్పలపాలెం, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో జాలర్లు ప్రతి రోజూ వేట జరుపుతున్నారు. సుమారు రెండువందల మంది జాలర్లు ఈ సీజన్‌లో జలాశయంలో చేపలవేట సాగిస్తారు. అనుకుంతగా రొయ్యలు వలలో పడడం లేదని జాలర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

మోదమ్మ ఉత్సవాలకు విరాళాల సేకరణ


పాడేరు సినిమాహాల్ సెంటర్‌లో విరాళాలు సేకరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు సంబంధించి భక్తుల నుంచి విరాళాల సేకరణ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. ఆలయ కమిటీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటైన నూతన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర, ప్రతినిధులు విరాళాల సేకరణ చేపడుతున్నారు. అమ్మవారి ఉత్సవాల కోసం విరాళాలకు అన్ని వర్గాల భక్తులు సహకరిస్తున్నారు. మే 14, 15, 16తేదీల్లో మోదమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు కొట్టగుల్లి సుబ్బారావు, రొబ్బి రాము, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రసాద్‌నాయుడు, కొండబాబు, కార్యదర్శులు నానిపాత్రుడు, రాంబాబు, శ్రీను, కొట్టగుల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే లక్ష్యం సొంతం


విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ నూకరాజు, అధికారులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం(ఫేర్‌వెల్ డే) శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, కొయ్యూరు ఎస్ఐ రాజారావు, రెవెన్యూ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ పట్టుదలతో చదివితే విజయం సొంతమవుతుందన్నారు. ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, దాన్ని సాధించేందుకు నిరంతర సాధన చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు కష్టాన్ని ఇష్టంగా మార్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి డి.సత్యనారాయణ సమకూర్చిన పరీక్ష ప్యాడ్‌లను పదో తరగతి విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నూకాలు, ఎంపీడీవో మేరీరోజ్, డౌనూరు ఎంపీటీసీ బి.అప్పారావు, కొయ్యూరు ఏపీజీవీ బీఎం సతీష్ కుమార్, కేజీబీవీ ఎస్‌వో శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల నిరసన



అరకులోయలో నిరసన తెలుపుతున్న నేతలు

పాడేరు రూరల్ : ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉద్యోగాల భర్తీలో శతశాతం ఉద్యోగాలు స్థానిక గిరిజనులతో భర్తీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎల్.సుందర్‌రావు డిమాండ్ చేశారు.

పాడేరులో శుక్రవారం వారపు సంతలో పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని నినాదాలు చేశారు. నాయకులు లక్కు, బొజ్జన్న, చిట్టిబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం నాయకులు బహిరంగ ర్యాలీ నిర్వహించారు. నాయకులు బాలదేవ్, రామారావు, జయ, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.


యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న కార్యవర్గ సభ్యులు

అడ్డతీగల: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సార్లం రాజబాబు, కోశాధికారి కె.కృష్ణ, కుటుంబ సంక్షేమ విభాగ డైరెక్టర్ తేజోరావు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎస్.నాగప్రసాద్, అధ్యక్షుడిగా బి.దొరబాబు, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్, కె.కమలరత్నం, ప్రధాన కార్యదర్శిగా ఎల్.మధురెడ్డి, కోశాధికారిగా కె.వి.రాఘవులతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా జి.తేజోరావు, సిహెచ్.చిన్నబాబుదొర, జెవిబి రమణమ్మ, ఎ.గాంధీరెడ్డి, కమలరత్నం, బి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. సీపీఎస్ మండల కమిటీ కన్వీనర్‌గా చినబాబుదొరని ఎన్నుకున్నారు. మరో ఐదుగురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఐక్యతకు ప్రతీక.. ఉరుసు వేడుక

- అన్సర్ మద్‌ని ఔలియా చందనోత్సవం నేడు
- తరలిరానున్న ముస్లింలు, హిందువులు
- దర్గా ప్రాంగణంలో జాతర


అన్సర్ మద్‌ని ఔలియా దర్గా

కశింకోట : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బయ్యవరంలోని హజరత్ అన్సర్ మద్‌ని ఔలియా ఉరుసు షరీఫ్(చందనోత్సవం) శనివారం జరగనుంది. ఇందుకు భారీ ఏర్పాట్లు చేసినట్లు దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవానికి జిల్లాతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలు, టాటా నగర్, ఒడిశా వంటి రాష్ట్రేతర ప్రాంతాల నుంచి ముస్లింలతోపాటు స్థానిక హిందువులు కూడా హాజరవుతారు. ఏటా మార్చి నెలలో ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఇస్లాం సేవలో ఔలియా

ఇస్లాం మతానికి ఔలియా విశేష సేవలందించారు. 13వ శతాబ్దంలో మహ్మద్ బీన్ తుగ్లక్ భారత దేశాన్ని పాలించే సమయంలో అన్సర్ మద్‌ని ఔలియా దక్షిణ భారత దేశంలో ధర్మ సంస్థాపనకు కృషి చేశారు. సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం తన గురువైన ఢిల్లీకి చెందిన హజరత్ నిజాముద్దీన్ ఆజ్ఞతో కశింకోటకు వచ్చి బోధనలు సాగించినట్టు చరిత్ర చెబుతుంది.

ప్రస్తుత గాడి వీధిలో అప్పట్లో ఆయన పెద్ద పుస్తక భాండాగారాన్ని నెలకొల్పారు. ఆయన బోధనలు నాటి ప్రజల్ని విశేషంగా ఆకట్టుకునేవి. బాధాతప్త హృదయాలకు సాంత్వన కలిగించేవని ప్రతీతి. అన్సర్ మద్‌ని ఔలియా మహిమలు భారతదేశంతో పాటు ఇతర దేశాలకు కూడా వ్యాపించి కోట్లాది భక్తులు, శిష్యులు ఆయన మార్గాన్ని అనుసరించారు. 1393 మే నెలలో అన్సర్ మద్‌ని ఔలియా పరమపదించినట్లు ఆధారాలున్నాయి. ఆయన భౌతిక కాయాన్ని స్థానిక బయ్యవరం గ్రామ సమీపంలోని కొండ వద్ద సమాధి చేశారు. ఆయనపై భక్తి విశ్వాసాలతో శిష్యులు ఏడు శతాబ్దాలుగా ఉరుసు షరీఫ్‌ను నిర్వహిస్తూ భక్తి ప్రపత్తులు చాటుకుంటున్నారు.

హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రతీక

ఉరుసు షరీఫ్‌ను పురస్కరించుకుని పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ముస్లిం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. అన్సర్ మద్‌ని సమాధిని దర్శించి ఛాదర్‌లు కప్పి పూలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేస్తారు. ఖర్జూరం, తీపి బూందీ, గులాబీ పూలు, చందనం, సుగంధ ద్రవ్యాలు వగైరా సమర్పిస్తారు. కొంతమంది రాత్రి ఇక్కడ కుటుంబ సభ్యులతో జాగరణ చేస్తారు.

ముస్లింలతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన హిందువులు కూడా ఔలియా దర్గాను దర్శించుకుని, ఉరుసు ఉత్సవంలో పాలు పంచుకుంటారు. హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా ఈ ఉత్సవం నిలుస్తుంది. దర్గా ప్రాంతంలో రాత్రి పెద్ద జాతర జరుగుతుంది. తిను బండారాలు, మహిళల అలంకరణ వస్తువులు, పిల్లల ఆట వస్తువులు జోరుగా విక్రయిస్తారు. ఉరుసు షరీఫ్ పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము నుంచి చందనోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి అంతా కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఔలియా సమాధికి చందనం పూయుట, సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక ప్రార్థన, అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. రాత్రి 'ఖవ్వాలి'ఉర్దూ భక్తి పాటల పోటీని ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా తీర్థం

రాంబిల్లి : నేవీ పునరావాసకాలనీలో శుక్రవారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, కోలాటాలు, తప్పెట గుళ్లు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.